ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 తమిళనాడు TAMILNADU

మంగళవారం 21 మే 2024

నిరుపేద గృహిణులకు

శుభవార్త

- మరో 2.30 లక్షల మందికి ప్రతినెలా రూ.1000
- జూలైలో దరఖాస్తుల పంపిణీ



చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు పొందిన నిరుపేదలకు, కొత్తగా వివాహం చేసుకున్న నిరుపేద జంటలకు 'కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం' అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఈ పథకం కింద కొత్తగా 2.30 లక్షల మంది గృహిణులను చేర్చుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది. జూలై నుంచి అర్హులైన గృహిణులకు దరఖాస్తులు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేపడతున్నారు. గతంలో మాదిరిగానే జిల్లాలవారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి గృహిణుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో కలెక్టర్లు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు, పురపాలక సంఘం, కార్పొరేషన్ మాజీ ఉద్యోగుల సతీమణులకు, కొత్తగా రేషన్ కార్డులు పొందిన నిరుపేద గృహిణులకు, కొత్తగా పెళ్ళిళ్లు చేసుకున్న నిరుపేద జంటలకు ప్రతినెలా రూ.1000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం లబ్ధిదారుల సంఖ్య పెంచుతామని మంత్రి ఉదయనిధి ప్రకటించారు. ముఖ్యమంత్రి కూడా ఈ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ అమలు చేసి తీరుతామని ప్రకటించారు.



జలపాతం వద్ద ఉధృతంగా పడుతున్న జలధారలు



పాపానాశం డ్యామ్‌లో జలకళ

తిరపరప్పు జలపాతంలో వరద

కన్నియాకుమారిలో

కుండపోత

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో సోమవారం ఉదయం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం కుండపోతగా మారింది. నాగర్‌కోవిల్, కన్నియాకుమారి, కొట్టారమ్, తక్కలై, ఇరానియల్, కుళిత్తురై తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. కాసేపయ్యాక చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం జోరందుకుంది. ఉరుములు, మెరుపులతో కుండతపోత వర్షాలు కురిశాయి. దీంతో అన్ని చోట్లా రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కారణంగా వడచేరి అన్నాబస్‌స్టేషన్ ప్రాంతాల్లో ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గింది. ఉదయం ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లేవారంతా సకాలంలో బస్సులు, ఆటోలు, టాక్సీలు లభించక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షాల కారణంగా పేచ్చిపారై డ్యామ్ నీటిమట్టం 45.41 అడుగులకు పెరిగింది. ఇక తిరపరప్పు జలపాతంలో వరదనీటి ప్రవాహం పెరిగింది. ఈ జలపాతం దగ్గరకు పర్యాటకులు వెళ్ళకుండా, అక్కడ స్నానాలపై నిషేధిస్తూ అధికారులు ఉత్తర్వు జారీ చేశారు. గత మూడు రోజులుగా ఆ జలపాతంలో నీటిప్రవాహం పెరిగింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ ఆ జలపాతంలో వరద నీరు ఎగసి పపడింది. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు జలపాతాలు, నదులు, సరస్సులు, చెరువుల వద్దకు వెళ్ళకూడదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ప్రకటన జారీ చేశారు.

51 అడుగులకు పెరిగిన పాపనాశం నీటిమట్టం

తిరునల్వేలి జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పాపనాశం డ్యామ్ జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం ఆ జలాశయంలో నీటి మట్టం 51 అడుగులకు పెరిగింది. ఇదే విధంగా మాంజోలై, మణిముత్తారు తదితర జలాశయాల్లో కూడా నీటి మట్టం పెరిగింది. ఈ ప్రాంతాల్లో స్నానం చేయడానికి ఎవరూ వెళ్ళకూడదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మణిముత్తారు జలాశయంలో నీటి మట్టం 95.40 అడుగులకు, సేర్వలారు జలాశయం నీటిమట్టం 62.86 అడుగులకు చేరిందని పేర్కొన్నారు.

రాష్ట్రానికి రెడ్ అలెర్ట్

23న భారీ వర్ష సూచన ● ఐఎండీ హెచ్చరిక

అడయార్, మే 20: ఈ నెల 23వ తేదీ రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఆ రోజు రాష్ట్రంలో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురవచ్చని పేర్కొంది. ఇదే విషయంపై ఐఎండీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దక్షిణ తమిళనాడు జిల్లాలు, వాటిని ఆనుకుని ప్రాంతాలపై బాహ్య ఉపరితల ద్రోణి నెలకొనివుంది. దాని కారణంగా సోమవారం అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. విరుదునగర్, తిరుపూర్, కోయంబత్తూరు, నీలగిరి, దిండిగల్ ప్రాంతాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి, రామనాథపురం, మదురై, శివగంగై, తూత్తుక్కుడి, తంజావూరు, తిరువారూర్, మైలాడుదురై, నాగపట్టణం, కడలూరు, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి, పుదుక్కోట జిల్లాలతో పాటు కారైక్కాల్ ప్రాంతంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. చెన్నై, పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, కన్నియాకుమారి సముద్రతీర ప్రాంతం, మన్నార్ జలసంధి, కేరళ పరిసర ప్రాంతాలు, లక్షద్వీప్‌లో భారీగా ఈదురు గాలులు గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. అందువల్ల ఆయా ప్రాంతాలకు చెందిన జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళొదని విజ్ఞప్తి చేసింది.

తప్పిన ఘోర ప్రమాదం

మరమలైనగర్ సమీపంలో సిగ్నల్ లోపం ● ఒకే ట్రాక్‌పై నాలుగు రైళ్లు



ప్యారీస్, మే 20: చెంగల్పట్టు జిల్లా మరమలైనగర్ సమీపంలో ఒకే ట్రాక్‌పై నాలుగు సబర్బన్ రైళ్లు ఒకదాని వెనుక ఒకటి అతి దగ్గరగా ఆగిన సంఘటన కలకలం రేపింది. సాంకేతికలోపం కారణంగా సిగ్నల్ పనిచేయకపోవడంతో ఈ తప్పిదం జరిగిందని రైల్వే భద్రతా విభాగం అధికారులు తెలిపారు. రాజధాని నగరం చెన్నై నుంచి పొరుగు జిల్లాలైన చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాలకు ప్రతిరోజు నడుపుతున్న సబర్బన్ రైళ్లలో వేలాది మంది ప్రయాణం చేస్తున్నారు. చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య నాలుగు రైలు మార్గాలున్నాయి. వీటిలో రెండు మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మిగతా రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, తాంబరం నుంచి చెంగల్పట్టు వరకు ఇటీవల మూడో రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సబర్బన్ రైళ్లను ఒకే సమయంలో నడపడం వల్ల తరచూ ఆ మార్గంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, సోమవారం మరమలైనగర్-సింగపెరుమాళ్‌కోయిల్ ప్రాంతంలో ఒకే ట్రాక్‌పై నాలుగు సబర్బన్ రైళ్లు ఒకదాని వెనుక ఒకటి అతిదగ్గరగా ఆగాయి. ఒకవేళ చివరగా ఆగిన రైలు వేగంగా ఆ ట్రాక్‌పై వచ్చి ఉంటే ముందున్న రైళ్లను ఢీకొనేందుకు అవకాశముండేదని, అయితే రైలింజన్ డ్రైవర్ల చాకచక్యం వల్ల చెంగల్పట్టు నుంచి చెన్నై బీచ్‌కు బయల్దేరిన నాలుగు రైళ్లు ప్రమాదం నుంచి బయటపడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సిగ్నల్‌కు మరమ్మతులు చేపట్టిన అనంతరం ఆ మార్గంలో సుమారు 40 నిమిషాల అనంతరం సబర్బన్ రైళ్ల రాకపోకలు యధావిధిగా సాగాయి.

హస్తినకు గవర్నర్



≡ ఢిల్లీ వెళ్ళిన ఆర్.ఎన్.రవి ≡

అడయార్, మే 20: రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి సోమవారం అకస్మాత్తుగా హస్తినకు బయలుదేరి వెళ్ళారు. మధ్యాహ్నం 11.25 గంటలకు విస్తారా ఎయిర్‌లైన్స్‌లో ఆయన నగరం నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఆయన వెంట గవర్నర్ కార్యదర్శి, సహాయకుడు, సెక్యూరిటీ ఆఫీసర్ ఉన్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే ఉండనున్న గవర్నర్.. ఈ నెల 22వ తేదీ రాత్రి చెన్నై చేరుకోనున్నట్లు సమాచారం. అయితే, గవర్నర్ ఉన్నట్టుండి ఆయన వ్యక్తిగత పనుల కోసం ఢిల్లీకి వెళ్ళారా లేక అధికారిక కార్యక్రమాల కోసం వెళ్ళారా అన్నది తెలియరాలేదు. పైపెచ్చు వచ్చే నెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. రాష్ట్రంలో అత్యధిక స్థానాలను డీఎంకే కూటమి పార్టీలు గెలుచుకుంటాయనే ప్రచారం సాగుతోంది. ఈ పరిస్థితుల్లో ఆయన ఢిల్లీకి వెళ్ళడం ఇపుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఉస్మాన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పొడవైన వంతెన



స్టీల్ రాడ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



టి.నగర్ బస్టాండ్ వరకు జరుగుతున్న వంతెన నిర్మాణం

శరవేగంగా సిద్ధమవుతున్న

టి.నగర్ 'ఇనుప వంతెన'

ప్యారీస్, మే 20: రాజధాని నగరానికి మరింత వన్నె చేకూర్చేలా వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందిన టి.నగర్‌లో రూ.131 కోట్లతో చేపట్టిన మొట్టమొదటి ఇనుప వంతెన నిర్మాణపనులు ముమ్మరంగా సాగుతున్నాయి. టి.నగర్ ఉస్మాన్ రోడ్డు, అన్నాసాలైను కలిపేలా నిర్మిస్తున్న ఈ వంతెన అందుబాటులోకి వస్తే ఇకపై ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు ఇబ్బందులుండవు. రంగనాథన్ వీధి జంక్షన్‌లో ఉస్మాన్ రోడ్డు వంతెన కిందకు దిగే ప్రాంతాన్ని కూల్చి అక్కడ స్టీల్ రాడ్లతో ఎత్తైన వంతెన నిర్మిస్తున్నారు. టి.నగర్ సౌత్ బోగ్ రోడ్డుకు వాహనాలు సులువుగా చేరుకొనేలా 1.2 కి.మీ పొడవున వంతెన నిర్మించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రణాళిక రూపొందించింది. 2023 మార్చిలో రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణపనులు ప్రారంభించారు. అన్నాసాలై, టి.నగర్‌లను సీఐటీ నగర్ మీదుగా కలిపేలా ఇనుప వంతెన రూపుదిద్దుకుంటోంది. అన్నాసాలైలో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య అందరికీ తెలిసిన విషయమే. ఈ రోడ్డు మీదుగా టి.నగర్‌కు వెళ్లే వారు నందనం సమీపంలోని సీఐటీ నగర్ మీదుగా టి.నగర్ బస్టాండ్ చేరుకుంటారు. అయితే సౌత్ ఉస్మాన్ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించిన నగర పాలక సంస్థ వందేళ్లు పటిష్టంగా ఉండేలా ఇనుప వంతెన నిర్మాణానికి నడుం బిగించింది. ప్రస్తుతం వంతెన నిర్మాణం చేపట్టిన కారణంగా టి.నగర్ ఉస్మాన్ రోడ్డు వంతెన మూసివేసి రాకపోకలు నిషేధించారు.

పోలీస్ స్టేషన్లలో

ప్రజలకు న్యాయసలహాలు

పార్టీలో పటిష్టమైన న్యాయవాదుల విభాగం ● టీవీకే నేత విజయ్ కొత్త వ్యూహం



చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్లకు వెళ్లే సామాన్య ప్రజలకు న్యాయసలహాలు అందించాలని తమిళగ వెట్రి కళగం నేత, నటుడు విజయ్ నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ తరపున న్యాయవిభాగాన్ని ఏర్పాటు చేసి న్యాయవాదులను నియమించాలని భావిస్తున్నారు. ఫిబ్రవరిలో రాజకీయ పార్టీని ప్రారంభించిన విజయ్ సభ్యత్వ కార్యక్రమాలు, పార్టీలో కొత్త కార్యవర్గాల ఏర్పాటు తదితర పనుల్లో తలమునలవుతున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా పార్టీ సభ్యత్వం పొందిన వారి సంఖ్య కోటి దాటిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు న్యాయసలహాలు అందించడానికి ఒక్కో పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు న్యాయవాదుల చొప్పున నియమించేందుకు విజయ్ చర్యలు చేపడుతున్నారు. పోలీసుస్టేషన్లకు వెళ్లే నిరుపేదలకు పార్టీకి చెందిన న్యాయవాదులు అండగా ఉంటూ వారికి న్యాయసలహాలు అందించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా పార్టీ న్యాయవాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని కూడా విజయ్ నిర్ణయించారు. ఈ వారంలో పున న్యాయవాదుల నియామకాలు పూర్తి చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇక రెండేళ్ల మాత్రమే సమయం ఉండటంతో ఆలోగా పార్టీ అన్ని విధాలా అభివృద్ధి పరచాలని ఆయన కంకణం కట్టుకున్నారు.

ఈసీ పనితీరుపై ఎన్నో అనుమానాలు

ఈపీఎస్ ఆరోపణ



మాజీ ఎమ్మెల్యే మలవన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ, ఆ తర్వాత ఈవీఎంలను భద్రపరచటంలోనూ ఎన్నికల సంఘం అధికారుల పనితీరు ఎన్నో అనుమానాలు కలిగించే విధంగా వుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. సోమవారం ఉదయం కోయంబత్తూరులో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే మలర్‌వన్ నివాసానికి వెళ్ళి ఆయన చిత్రపటం వద్ద ఈపీఎస్ పుష్పాంజలి ఘటించి, మలర్‌వన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేరళ ప్రభుత్వం ఇడుక్కి జిల్లాలోని సిలంది వాగుపై చెక్‌డ్యామ్ నిర్మిస్తోందని, ఆ నిర్మాణం పూర్తయితే అమరావతి డ్యామ్‌కు నీటి సరఫరా ఆగిపోతుందన్నారు. ఈ విషయపై డీఎంకే ప్రభుత్వం మెతకవైఖరిని అవలంబించడం గర్హనీయమన్నారు. సిలంది వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే రీతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలారు వాగుపై, కర్ణాటక ప్రభుత్వం కావేరి నదిపై మెకెదాటు వద్ద ఆనకట్టలు నిర్మించే ప్రయత్నాలను నిరోధించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం పనితీరు సంతృప్తికరంగా లేదని, అన్నాడీఎంకేకు చెందిన లక్షలాదిమంది కార్యకర్తల పేర్లను ఓటర్ల జాబితా నుంచ తొలగించారని, ఈవీఎంలు భద్రపరచిన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయని తాను చేసిన ఆరోపణ పట్టించుకోలేదన్నారు. రాజధాని నగరంలో ఈవీఎంలు భద్రపరచిన మూడు ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం గర్హనీయమన్నారు. ఎంత సేపూ ఓటింగ్ శాతం పెంచామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికలను సాఫీగా నిర్వహించలేదని, పలుచోట్ల అన్నాడీఎంకే సభ్యులను ఓటేయ్యకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఏదేమైనా ఎన్నికల సంఘం పనితీరుపై తమ పార్టీ ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయని ఈపీఎస్ ఆరోపించారు.

వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్

నా టార్గెట్

గ్రాండ్ మాస్టర్ గుకేష్



తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): తాను ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించానని,అయితే ఛాంపియన్ కావడమే తన మెయిన్ టార్గెట్ అని చెస్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో గుకేష్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం గుకేష్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కొన్ని టోర్నమెంట్లు ఆడనున్నట్టు తెలిపారు.

సమాచార దర్శిని

జేఈఈ పరీక్షా ఫలితాల విడుదల

ఐసిఎఫ్, మే 20: జేఈఈ రెండో విడత మెయిన్ పరీక్ష లైన బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ వంటి కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో యూజీ కోర్సుల్లో చేరేందుకు జేఈఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షలు ప్రిలిమినరీ, మెయిన్స్ రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం తొలివిడత పరీక్షలు జనవరిలో జరుగ్గా ఫలితాలు ఫిబ్రవరిలో విడుదలయ్యాయి. రెండవ విడత పరీక్షలు గత ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు జరిగాయి. వాటిలో బీఆర్క్ బీ ప్లానింగ్ కోర్సుల పరీక్షా ఫలితాలు jeemain.nta.ac.in అనే వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. ఇతర వివరాలకు 011-40759000/69227700 నెంబర్లు సంప్రదించవచ్చు.

రూ.1,200 కోట్లతో సరుకుల రవాణా పార్క్

ఐసిఎఫ్, మే 20: తిరువళ్లూర్ జిల్లా మప్పేడు పంచాయతీలో రూ.1,200 కోట్లతో సరుకుల రవాణా పార్క్ ఏర్పాటు కానుంది. రాష్ట్ర వృత్తుల అభివృద్ధి సంస్థ, నేషనల్ హైవే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ సంస్థ, చెన్నై హార్బర్లు సంయుక్తంగా 181ఎకరాల్లో ఈపార్క్ ఏర్పాటుకు 2021లో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పథకానికి సంబంధించి ప్రాథమిక దశ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా తిరువళ్లూర్‌జిల్లా మన్నూరునుంచి పార్క్ వరకు 5.4 కి.మీ మేర రూ.58 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, వాననీటి కాల్వల నిర్మాణం, మీడియన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పార్క్ ఏర్పాటుతో రాష్ట్రంలో 10,000 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు.

నెమలి, చిలుకలు పెంచితే ఏడేళ్ల జైలు

ఐసిఎఫ్, మే 20: ఇళ్లల్లో వ్యాపార ఉద్దేశంతో చిలుకలు, నెమళ్లు వంటి వాటిని పెంచితే ఏడేళ్లు జైలుశిక్ష విధించనున్నట్లు అటవీ శాఖ హెచ్చరించింది. అంతరించిపోతున్న పక్షి, జంతు జాతుల్లో కొన్నింటిని కొంతమంది పెంచుకుంటున్నారు. వీటి పెంపకాలపై నిషేధం ఉన్నప్పటికీ, ఉత్తర్వులను ఖాతరు చేయడం లేదు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు ఇదివరకే ఉన్న నిబంధనలు సడలించిన అటవీశాఖ, బెయిలుపై విడుదల కాని విధంగా నెమళ్లు, చిలుకలు పెంచే వారికి రూ.10,000 జరిమానాతో పాటు ఏడేళ్ల జైలుశిక్ష విధించనున్నట్లు పేర్కొంది.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఐసిఎఫ్, మే 20: రాష్ట్రప్రభుత్వ ఎంజీఆర్ వెండి తెర, బుల్లి తెర శిక్షణా సంస్థ అందించే కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ గడువు జూన్ 10వ తేది వరకు పొడిగించారు. ఈసంస్థ తమిళనాడు డా.జె.జయలలిత సంగీత, లలిత కళల విశ్వవిద్యాలయంతో కలసి పలు కోర్సులు అందిస్తోంది. ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు సమర్పణ ఈ నెల 27వ తేదీతో ముగియనుండగా, విద్యార్థుల సౌకర్యార్థం జూన్ 10వ తేది వరకు పొడిగించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

వైద్య కమిషన్ అధ్యక్షుడి పేరుతో నకిలీ ఫోన్‌కాల్స్

ఐసిఎఫ్, మే 20: జాతీయ వైద్య కమిషన్ అధ్యక్షుడు డా.గంగాధర్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఫోన్ కాల్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నట్లు జాతీయ వైద్య కమిషన్ తెలిపింది. ఇటీవల 7050392639 అనే నెంబరు నుంచి డాక్టర్లు, వైద్య సిబ్బంది, ప్రజలకు గంగాధర్ పేరుతో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఆ నెంబరు తనది కాదని, ఇలాంటి అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం కలిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మ్యాప్‌ల విడుదలలో నిబంధనలు పాటించాలి

ఐసిఎఫ్, మే 20: విద్యార్థుల కోసం మ్యాప్‌లు తయారు చేసి విడుదల చేయడంలో భారత సర్వే శాఖ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో తగిన చర్యలు చేపడతామని యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాల, కళాశాల విద్యార్థులకు భారత చరిత్ర, భౌగోళిక మ్యాప్‌లను విద్యాసంస్థలు, ప్రైవేటు ప్రచురణ సంస్థలు తయారుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, భారత దేశం, చైనా, పాకిస్తాన్ సరిహద్దు సమస్యలు ఎక్కువవుతున్నాయి. వీటికి సంబంధించిన మ్యాప్‌లను విడుదల చేస్తున్నారు. పొరుగు దేశాలు విడుదల చేసే మ్యాప్‌లను భారత దేశ విద్యార్థులకు అందజేయడాన్ని అడ్డుకొనేలా యూజీసీ విద్యా సంస్థలకు నిబంధనలు సూచించింది.

విదేశాల్లో చదువుకున్న వైద్యుల శిక్షణకు అనుమతి

ఐసిఎఫ్, మే 20: విదేశాల్లో వైద్య కోర్సులు పూర్తిచేసుకున్న వారు రాష్ట్రంలో రెండేళ్ల శిక్షణ పొందేందుకు జాతీయ వైద్య కమిషన్ అనుమతులు మంజూరు చేసింది. విదేశాల్లో చదువుకున్న వారు కమిషన్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం వైద్యకళాశాలల్లో ఫీజు చెల్లించి శిక్షణ పొందుతున్నారు. గత ఏడాది గుర్తింపు పొందిన 70 కళాశాలల్లో 4,430 సీట్లు కేటాయించారు. ఈ ఏడాది ఈ సంఖ్య ఎక్కువగా ఉండడంతో మరిన్ని సీట్లు కేటాయించాలని జాతీయ వైద్య కమిషన్‌ను కోరారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో 38 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, పుదుచ్చేరిలో రెండు ఆస్పత్రుల్లో వైద్య శిక్షణ పొందేందుకు అనుమతి ఇచ్చింది.

పుళల్ జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, మే 20: వర్షాల కారణంగా పుళల్ జలాశయానికి ఇన్‌ఫ్లో 318 ఘనపుటడుగులకు పెరిగింది. రెడ్‌హిల్స్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వాటికారణంగా జలాశయానికి ప్రవాహం పెరుగుతోంది. శనివారం 215ఘనపుటడుగులున్న ఇన్‌ఫ్లో ఆదివారం 318 ఘనపుటడుగులకు పెరిగింది. 3,300 మిలియన్ ఘనపుటడుగులు సామర్థ్యం కలిగిన ఈ జలాశయంలో ప్రస్తుతం 2,868 మిలియన్ ఘనపుటడుగుల నీరుంది. జలాశయం నుంచి తాగునీటి అవసరాలకు సెకనుకు 184 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు.

55 మంది చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్ ఇవ్వండి

హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, మే 20: మదురైలో ఉన్న శిశు సంరక్షణ కేంద్రం తరఫున దాఖలైన కేసులో 55 మంది చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్ అందజేయాలని హైకోర్టు మదురై బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మదురైలో గుర్తింపు పొందిన పిల్లల దత్తత కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 55 మంది చిన్నారులు పాఠశాలలో చేరేందుకు వీలుగా బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ మదురై కార్పొరేషన్‌కు చిన్నారుల సంరక్షణ సంస్థ వినతి పత్రం సమర్పించింది. అయితే సర్టిఫికెట్ల పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో ఆ సంస్థ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేసింది. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, 55 మంది చిన్నారులకు సంబంధించిన వివరాలు, దత్తత కేంద్రం లైసెన్స్ ఇతర ఉత్తర్వులన్నీ సక్రమంగా ఉన్నాయని, అందువల్ల వెంటనే బర్త్ సర్టిఫికెట్ అందజేయాల్సిందిగా మదురై కార్పొరేషన్‌కు ఉత్తర్వులు జారీచేసింది.

వెల్లివిరిసిన మతసామరస్యం

- క్రైస్తవ ఫాదర్ల సమక్షంలో ఆలయ కుంభాభిషేకం

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లా జయంకొండం వద్ద మత సామరస్యతను ఎలుగెత్తి చాటేలా క్రైస్తవ మతపెద్దల సమక్షంలో హిందూ దేవాలయ కుంభాభిషేకం అట్టహాసంగా జరిగాయి. జయంకొండం సమీపం నడవలూరు గ్రామంలో రాజగణపతి, వరసిద్ధి వినాయకుడు, మహా మారియమ్మన్, వీరనార్, అయ్యనార్ స్వామి సన్నిధులతో మూడు ఆలయాలున్నాయి. ఆ మూడు ఆలయాల జీర్ణోద్ధరణ పనులు ఇటీవలే ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆ ఆలయాల కుంభాభిషేక వేడుకలు జరిగాయి. వేద పండితులు, ఆలయాలప్రధానార్చకుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ గోపురాలపై కలశాలను పవిత్ర నదీ జలాలతో సంప్రోక్షించారు. ఆలయ గోపురాలపైకి వేదపండితులు, అర్చకులు కలశాలలో పవిత్ర జలాలను తీసుకెళ్తున్నప్పుడు వారితోపాటు క్రైస్తవ మత పెద్దలు రాబర్ట్, జోసెఫ్ ధనరాజ్ గోపురాలపైకి వెళ్లారు. ఆ తర్వాత క్రైస్తవ ఫాదర్ల సమక్షంలో కలశాలపై పవిత్ర నదీ జలాలను చల్లారు. ఆ తర్వాత అభిషేక జలాలను దిగువనున్న భక్తులపై చల్లారు. ఆ తర్వాత భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



క్రైస్తవ ఫాదర్‌ల సమక్షంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు, ఆలయ ప్రధానార్చకులు

నరసింహస్వామి ఆలయ కుంభాభిషేకం

ముహూర్తపు రాట వేసిన ఎమ్మెల్యే



ఆలయ నిర్వాహకులతో కలిసి ముహూర్తపు రాట వేస్తున్న ఎమ్మెల్యే మణి కన్నన్

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): కళ్ళకుర్చి జిల్లా ఉళుందూరుపేట సమీపంలోని పరిక్కల్ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం ఆ వేడుకలకు సంబంధించి ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయంలో జూన్ తొమ్మిదిన మహాకుంభాభిషేకం జరుగనుంది. ఆ కుంభాభిషేకం ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఉదయం ఆలయ నిర్వాహకుల సమక్షంలో ఉలుందూరుపేట శాసనసభ్యుడు మణికన్నన్ స్తంభ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మదనా, మాజీ జిల్లా కౌన్సిలర్ పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

తమిళ పరిశోధన కళాశాలలో అడ్మిషన్లు

పెరంబూర్, మే 20: తరమణిలోని ప్రపంచ తమిళ పరిశోధన కళాశాలలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయమై కళాశాల విడుదల చేసిన ప్రకటనలో.. ఎంఏ తమిళం, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంఏ తమిళం, పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో జూన్ 7వ తేదిలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు www.ulakaththamizh.in అనే వెబ్‌సైట్, 044-22542992 అనే చిరునామాను సంప్రదించవచ్చు.

మరో ఆరురోజులు ఊటీ ఫ్లవర్ షో పొడిగింపు

పెరంబూర్, మే 20: నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న 126వ పుష్ప ప్రదర్శన ఈ నెల 26వ తేది వరకు పొడిగించారు. ఈ పుష్ప ప్రదర్శన ఈ నెల 10వ తేది ప్రారంభమై 20వ తేది వరకు ఉంటుందని జిల్లా అధికారులు ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సోమవారం సాయంత్రం ముగింపు వేడుకలు నిర్వహించగా, రకరకాల పూలతో ఏర్పాటుచేసిన బొమ్మలు, నమూనాలను పర్యాటకులు ఈ నెల 26వ తేది వరకు వీక్షించవచ్చని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకి బస్సులు

పెరంబూర్, మే 20: కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శని తదితర వారాంతపు, విశేష రోజుల్లో మాత్రమే తిరువణ్ణామలైకు బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రోడ్డు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ప్రకటించింది. కిలంబాక్కం బస్ టెర్మినల్ ప్రారంభమయ్యాక అక్కడినుంచే తిరువణ్ణామలైకు బస్సులు నడుపుతున్నారు. కానీ, నగరం నుంచి తిరువణ్ణామలై వెళ్లే భక్తులు కిలంబాక్కం వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది.. వీరి సౌకర్యార్థం కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు ప్రతి రోజు 80 బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ ఇదివరకు ప్రకటించింది. కానీ, తాజాగా ఈ నెల 23వ తేది నుంచి శుక్ర, శనివారాలు, విశేష రోజుల్లో మాత్రమే కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు బస్సులు నడపాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

13 యేళ్ల క్రితం మాయమైన బాలిక కోసం ఏ.ఐ. ఫొటోతో గాలింపు



రెండేళ్లనాటి బాలిక ఫొటో, ఏఐతో పోలీసులు తయారు చేసిన ఫొటో

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): సాలిగ్రామం మజీద్‌నగర్‌కు చెందిన గణేష్ కుమార్తె కవిత రెండేళ్ల వయస్సులో 2011లో మాయమైంది. విరుగంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసుకుని 13 యేళ్లు గడిచినా ఆ బాలిక జాడ కనుగొనలేక పోయారు. దీంతో ఆ బాలిక ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు కృత్రిమ మేథోపరిజ్ఞానాన్ని (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) ఉపయోగించేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు రెండేళ్ల క్రితం తీసిన బాలిక ఫొటో ఆధారంగా ప్రస్తుతం ఆ బాలిక ఎలా ఉంటుందో ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫొటో తయారు చేశారు. దానిఆధారంగా పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం కవిత చిన్నప్పటి ఫొటో, ఏఐతో తయారు చేసిన ఫొటోను అన్ని పోలీసుస్టేషన్లకు పంపారు.

గంజాయి, మత్తు మాత్రల విక్రయం: ఆరుగురి అరెస్టు

అడయార్, మే 20: ఎంజీఆర్ నగర్ మార్కెట్ ప్రాంతంలో గంజాయి, మత్తు మాత్రలు విక్రయించిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒక కాలేజీ విద్యార్థి కూడా ఉన్నాడు. వీరి నుంచి 80 మత్తు మాత్రలు, 2.300 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని ఎంజీఆర్ నగర్ నెడుంజెళియన్ వీధికి చెందిన రాజపాండి, రౌడీ కిషోర్, సతీష్, అభిషేక్, కేకేనగర్ ఈస్ట్ వన్నియర్‌వీధికిచెందిన విగ్నేష్ అలియాస్ విక్కీ, సంతోష్ అనే విద్యార్థిని అరెస్టుచేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమో దుచేసి విచారణ జరుపుతున్నారు. అదేవిధంగా చింతాద్రిపేట రిచ్ స్ట్రీట్‌లో మత్తు మాత్రలనుంచి మత్తు ఇంజెక్షన్లు తయారు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆప్రాంతంలో తనిఖీలు జరిపి ఇద్దరు రౌడీలను అరెస్టు చేశారు. వీరిని ఆకాష్, మణికంఠన్‌లుగా గుర్తించారు. వీరినుంచి మత్తు ఇంజెక్షన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

అడయార్, మే 20: బాలిక అత్యాచారం కేసులో తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన నిందితుడిని పోలీసులు సముద్రంలో చుట్టుముట్టి అరెస్టు చేశారు. కన్నియాకుమారి జిల్లా కులచ్చల్ ప్రాంతానికి చెందిన జిల్సన్ (22) గత యేడాది ఒక బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, జిల్సన్ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్రంలో ఒక పడవలో దాగివున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు.. కోస్ట్‌గార్డ్ సిబ్బంది సాయంతో జిల్సన్‌ను అరెస్టు చేశారు.

సిలంది వాగుపై కేరళ ఆనకట్ట

పీఎంకే నేత అన్బుమణి ఖండన

ప్యారీస్, మే 20: కావేరి ఉప నదుల్లో ఒకటైన అమరావతి డ్యాంకు నీరు సరఫరా చేసే సిలంది వాగుపై కేరళ ప్రభుత్వం అతిపెద్ద చెక్‌డ్యాం నిర్మించడాన్ని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి ఖండించారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... సిలంది వాగుపై అతిపెద్ద చెక్‌డ్యాం నిర్మాణ పనులను కేరళ ప్రభుత్వం ప్రారంభించిందని, అందువల్ల తిరుప్పూర్, కరూర్ జిల్లాల్లో తాగునీరు, సాగు నీటి ఆధారమైన అమరావతికి నీరు చేరదని, ఈ చర్యలను రాష్ట్రప్రభుత్వం తక్షణం ఖండించాలని కోరారు. రాష్ట్రానికి చెందాల్సిననీటిని కేరళ అడ్డుకోవడం ఇది మొదటిసారికాదని, ఇంతకుముందు కూడా భవాని చెరువుపై రెండు చెక్‌డ్యాంలు నిర్మించి నీటి పారుదల చట్టాన్ని ఉల్లంఘించిందన్నారు. ఆ తర్వాత 2018లో మూడో చెక్‌డ్యాం నిర్మాణాన్ని ఖండిస్తూ ఆనైకట్టు ప్రాంతంలో పీఎంకే ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనతో కేరళ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. రాష్ట్రానికి ఒప్పందం ప్రకారం జలాలు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్న పొరుగు రాష్ట్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని అన్బుమణి డిమాండ్ చేశారు.

చేతికొచ్చిన పంట నీటిపాలు: డెల్టా రైతుల కన్నీరు

అడయార్, మే 20: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను కష్టాలపాలు చేస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నీటిపాలవుతుంది. ముఖ్యంగా కావేరీ డెల్టా ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంట నీట మునిగింది. దీంతో ఈ ప్రాంత రైతులు లబోదిబో మంటున్నారు. ఈ డెల్టా జిల్లాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. నాగపట్టణంలో ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకు కురిసింది. వేలాంకణ్ణి, తిరుమురుగల్, కీళ్‌వేలూరు తదితర ప్రాంతాల్లో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు వర్షం కురిసింది. అదేవిధంగా మైలాడుదురై, తిరుచ్చి తదితర ప్రాంతాల్లో ఆదివారం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగిపోయింది.

తాటి పదార్థాల విక్రయాల్లో ఆవిన్

ఐసిఎఫ్, మే 20: పాల పదార్థాలతోపాటు తాటితో తయారయ్యే పదార్థాలను ఆవిన్ సంస్థ విక్రయించనుంది. ఈ సంస్థ పాలు మాత్రమే కాకుండా స్వీట్లు, ఐస్‌క్రీమ్ వంటి 230కి పైగా పదార్థాలను విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, తాటి ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించేలా తాటిబెల్లం, నాటుచక్కెర, శొంఠికాపీ పౌడర్ వంటివి విక్రయించనుందని ఆవిన్ సంస్థ అధికారులు తెలిపారు.

డ్రైవర్ లేకుండా నడిచిన వాహనం

ప్యారీస్, మే 20: స్థానిక మధురవాయల్ ఆలపాక్కంలో డ్రైవర్ లేకుండా తిరిగిన చెత్త సేకరణ వాహనం ఢీకొని బైక్‌లో వెళుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) వలసరవాక్కం జోన్ పరిధిలోని ఆలపాక్కంలో సోమవారం ఉదయం బ్యాటరీ చెత్త సేకరణ వాహనాన్ని డ్రైవర్ రోడ్డు మధ్య నిలిపాడు. ఆ వాహనం ముందుకు వెళ్లడంతో బైక్‌లో వెళ్తున్న ఆర్ముగాన్ని ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. దీనిపై మధురవాయల్ పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



అంజలి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 20: రామనాథపురం జిల్లా కముది పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే అంజలి 2017లో కోయంబత్తూర్ జిల్లా సాయుధదళానికి బదిలీ అయ్యారు. అంజలి భర్త సెల్వకుమార్‌తో కలసి కోవై మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని పోలీస్ క్వార్టర్స్‌లో నివసిస్తోంది. సెల్వకుమార్ ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వీరి వివాహమై 9 ఏళ్లు గడిచినా పిల్లలు లేకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని సమాచారం. ఈ నేపథ్యంలో, ఈ నెల 18వ తేది అంజలి రెండు రోజులు సెలవు పెట్టి సెల్వకుమార్ స్వగ్రామం శివగంగ జిల్లా మరవమంగళం వెళ్లారు. ఆ ఇంట్లోని గదిలో ఉన్న అంజలి ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మరవమంగళం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

దోపిడీపై తప్పుడు ఫిర్యాదు

కోవై బీజేపీ ప్రముఖుడిపై కేసు



పోలీసులు నిర్బంధించిన మణికంఠన్, తప్పుడు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత విజయకుమార్

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): కోవైలోని తన ఇంటి జరిగిన దోపిడీలో రూ.1.5 కోట్ల విలువైన నగదు, నగలు దోపిడీకి గురైనట్లు తప్పుడు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోయంబత్తూరులో నివసిస్తున్న బీజేపీ నేత విజయకుమార్ నివాసంలో శనివారం రాత్రి దోపిడీ జరిగింది. ఆ దోపిడీలో ఇంటిలో ఉన్న రూ.1.5 కోట్ల నగదు, 9 సవర్ల నగలు, 200 గ్రాముల వెండి వస్తువులు మాయమైనట్లు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి దోపిడీకి పాల్పడిన తిరువారూరుకు చెందిన అన్బరసన్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.18.5లక్షల నగదు, 9 సవర్ల బంగారు నగలు, 200 గ్రాములు వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విజయకుమార్ ఫిర్యాదు చేసినట్లు రూ.1.5 కోట్ల నగదు దోపిడీకి గురికాలేదని పోలీసులు తెలుసుకున్నారు. వెంటనే విజయకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపినప్పుడు తప్పుడు ఫిర్యాదు ఇచ్చినట్లు అంగీకరించాడు. దోపిడీ కేసును పోలీసులు త్వరగా జరపాలనే ఉద్దేశంతోనే రూ.18.5లక్షల నగదుకు బదులుగా రూ.1.5కోట్లు నగదు దోపిడీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో విజయకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఉత్తర్వు ప్రకారం ఆయనపై రెండు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసినట్లు కోయంబత్తూరు ఎస్పీ బద్రీనారాయణన్ తెలిపారు.




నీటిపై తేలుతున్న నూనె తెట్టు

పాంబన్ సముద్రంలో నూనె తెట్టు

ఐసిఎఫ్, మే 20: పాంబన్ సముద్రంలో నీటిపై తేలుతున్న నూనె తెట్టుతో మత్స్య సంపద అంతరించిపోయే అవకాశమున్నట్లు ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాంబన్ నుంచి తూత్తుకుడి వరకు మన్నార్ వళైకుడ సముద్రంలో ఉన్న 21 దీవుల చుట్టూ 2,000 రకాల అరుదైన చేపలు నివసిస్తున్నాయి. వీటిని సంరక్షించేలా దీవుల సమీపంలో చేపల వేటపై అటవీ శాఖ నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లోని జాలర్లు తమ పడవల ఇంజన్లకు మరమ్మతులు చేపడుతున్నప్పుడు విడుదలయ్యే ఆయిల్ వ్యర్థాలతో నీటిపై నూనె తెట్టును తలపిస్తున్నాయి. చేపలకు శ్వాస సంబంధమైన ఇబ్బందులు తలెత్తి ప్రాణాలు కోల్పోయే అవకాశముందని, సముద్రాన్ని కలుషితం చేయడంపై అవగాహన కల్పించడంతో పాటు నూనె తెట్టు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సంఘ శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన తిమింగళం



ఐసిఎఫ్, మే 20: తూత్తుకుడి జిల్లా నరిపయ్యూర్ సముద్రతీర ప్రాంతానికి ఆదివారం హఠాత్తుగా ఓ తిమింగళం కొట్టుకువచ్చింది. జాలర్లు అందించిన సమాచారంతో తూత్తుకుడి అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. క్రేన్ సాయంతో దానిని సముద్రంలోకి మళ్లీ చేర్చారు. కొద్దిసేపట్లోనే మరో రెండు తిమింగళాలు తీరానికి దగ్గర్లో కనిపించాయి. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... తీరానికి కొట్టుకొచ్చిన తిమింగళం 'కిల్లర్ వేల్' రకానికి చెందిందని, ఇది మన దేశంలో అరుదుగా కనిపిస్తుంటాయని తెలిపారు.

బాణసంచా గోడౌన్‌లో పేలుడు: ఒకరి మృతి



పేలుడు సంభవించిన ప్రాంతం

ప్యారీస్, మే 20: పుదుకోట జిల్లా విరాలిమలై సమీపంలోని అత్తిపల్లం ప్రాంతంలో ఉన్న బాణసంచా గోడౌన్‌లో పేలుడు ప్రమాదం జరిగి సంఘటనా స్థలంలోనే ఒకరు మృతిచెందారు. అత్తిపల్లంలో వేల్‌మురుగన్‌కు చెందిన బాణసంచా గోడౌన్‌లో సోమవారం ఉదయం వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో కలిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పేలుడు జరిగిందని ప్రాథమిక విచారణలో తేలింది. వెల్డింగ్ పనులను పర్యవేక్షిస్తున్న వేల్‌మురుగన్ సోదరుడు కార్తీక్ (27) ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలిసి ఫైరింజన్‌తో ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వేల్‌మురుగన్‌ను మనప్పారైలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పేలుడుపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

బస్సు నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్ మృతి

ప్యారీస్, మే 20: చెంగల్పట్టులో ప్రభుత్వ బస్సు నడుపుతూ హఠాత్తుగా గుండెపోటు రావడంతో డ్రైవర్ మరణించిన విషాద సంఘటన ఆదివారం సాయంత్రం సహ ఉద్యోగులను కంటతడి పెట్టించింది. కాంచీపురం జిల్లా వాలాజాబాద్ ఆరపాక్కం గ్రామానికి చెందిన శేఖర్ (52) 2007వ సంవత్సరం ప్రభుత్వ రవాణా సంస్థలో డ్రైవర్‌గా చేరి ప్రస్తుతం చెంగల్పట్టు రవాణా సంస్థలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చెంగల్పట్టు నుంచి బయల్దేరిన రూట్ నెం.129వ బస్సులో శేఖర్ డ్యూటీకి వెళ్లారు. ఆ బస్సు పుదూర్‌ను సమీపిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో శేఖర్ తన సీటులోనే ప్రాణాలు కోల్పోయాడు. బస్సులోని ప్రయాణికుల సాయంతో శేఖర్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రిప్లికేన్‌లో రూ.2.72 లక్షల స్వాధీనం

ప్యారీస్, మే 20: స్థానిక ట్రిప్లికేన్ హైరోడ్డులో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు, ఇద్దరు యువకుల నుంచి రూ.2.72 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ట్రిప్లికేన్ హైరోడ్డులోని ఓ ప్రైవేటు బ్యాంక్ ముందు వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు అటు వైపు బైక్‌పై వేగంగా వెళ్లిన ఇద్దరు యువకులను ఆపారు. అనుమానంతో వారి బ్యాగును తనిఖీ చేసి అందులోని రూ.2.72 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... ఆ యువకులు రామనాథపురంకు చెందిన నియాస్ అహ్మద్ (20), మహమ్మద్ యూసఫ్ అని తెలిసింది. ఈ నగదుకు ఎలాంటి రసీదులు లేనందున వారి సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

యాసిడ్ దాడిలో ఆరుగురికి గాయాలు

ప్యారీస్, మే 20: స్థానిక ఈకాట్టుతాంగల్‌లో ఫుట్‌పాత్‌పై కూర్చున్న ఆరుగురు యాసిడ్ దాడికి గురై గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఈకాట్టుతాంగల్ మెట్రో రైల్వేస్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న కొన్ని పేద కుటుంబాలు పగలు పనులకు వెళ్లి సాయంత్రానికి తిరిగి అక్కడకు చేరుకుంటారు. ఆ విధంగా ఆదివారం రాత్రి ఫుట్‌పాత్ కూర్చొని మాట్లాడుకుంటున్న గణేశన్, ఆయన భార్య రేవతి, కుమార్తె సహా ఆరుగురిపై అటుగా వెళ్లిన గుర్తుతెలియని ఓ వ్యక్తి వారిపై యాసిడ్ బాటిల్ విసిరి పరారైనట్లు తెలిసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గణేశన్ కుమార్తె వైష్ణవిని ఎగ్మూర్ ప్రభుత్వ పిల్లల ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన మిగిలిన ఐదుగురు సైదాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు యాసిడ్ దాడికి పాల్పడి పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

ఇండియన్ బ్యాంక్‌లో దోపిడీయత్నం



దొంగల దాడిలో పగిలిన బ్యాంక్ అద్దాలు, వంగిపోయిన కమ్మీలు

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మానామదురై అన్నా విగ్రహం కూడలి వద్దనున్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచిలో గుర్తు తెలియని దుండగులు తలుపులు, కిటికీలు పగులగొట్టి దోపిడీ యత్నానికి పాల్పడ్డారు. శని, ఆదివారాల సెలవు తర్వాత సోమవారం ఉదయం బ్యాంక్ సిబ్బంది బ్యాంక్ తెరిచేందుకు వెళ్లగా కిటికీ తలుపులు, ప్రవేశద్వారం తలుపులు పగులగొట్టి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేలిముద్రల సేకరణ నిపుణులతో హుటాహుటిన అక్కడికి వెళ్ళి పరిశీలించారు. దోపిడీ దొంగలు ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి బ్యాంక్ లోపల వెళ్లకుండా తిరిగి వెళ్ళిపోయిన ఆనవాళ్లున్నట్లు పోలీసులు తెలిపారు. దోపిడీకి సిద్ధమవుతున్న సమయంలో మెయిన్‌రోడ్డులో స్థానికుల సంచారం వల్ల, వాహనాల రాకపోకల శబ్దాలకు భయపడి పారిపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

నేడు రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి, సేవా కార్యక్రమాలు

ప్యారీస్, మే 20: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో నివాళి, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఉదయం 7 గంటలకు రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి ఉగ్రవాద నిర్మూలన ప్రతిజ్ఞ చేయనున్నారు. అనంతరం పేదలకు అన్న, వస్త్ర దానాలు చేపడతారు. ఆతర్వాత తిరువళ్లూర్ జిల్లా శ్రీపెరుంబుదూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తారు. ఉదయం 9గంటలకు అక్కడినుంచి ర్యాలీగా రాజీవ్ స్మారక మందిరం చేరుకొని పుష్పాంజలి ఘటిస్తారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలనుంచి యాత్రగా తీసు కొచ్చే రాజీవ్ స్మారక జ్యోతిని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, సీఎల్పీ లీడర్ రాజేష్‌కుమార్‌సహా సీనియర్ నాయకులు ఆహ్వానిస్తారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా స్మారక మందిర ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరాన్ని కూడా ప్రారంభిస్తారు.

అంత్యక్రియలకు రూ.10వేలు దాచి కన్నుమూసిన వృద్ధురాలు

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): సేలం అమ్మాపేటలో 92 యేళ్ల బామ్మ తన అంత్యక్రియల ఖర్చుల కోసం పక్కింటి మహిళ వద్ద రూ.10వేలు దాచి కన్నుమూసిన సంఘటన స్థానికులను కంటతడిపెట్టించింది. ఈ విషయం తెలుసుకుని కార్పొరేషన్ కౌన్సిలర్ తన సొంత ఖర్చులతో ఆ బామ్మకు అంత్యక్రియలు జరిపించారు. అమ్మాపేటలో పొన్నమ్మాళ్ (92) అనే బామ్మ ఒంటరిగా నివసిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త మాణిక్యం మృతి చెందారు. ఈ నేపథ్యంలో పొన్నమ్మాళ్ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ తనకు అంత్య కాలం సమీపిస్తోందని భావించారు. ఆ తర్వాత ఆమె ఇంటి పనులు చేసి సంపాదించిన సొమ్ములో కాస్త పొదుపు చేస్తూ రూ.10వేలను మిగిల్చారు. తన ఇంటి పక్కనే ఇడ్లీ వ్యాపారం చేస్తున్న సావిత్రి అనే మహిళ దగ్గర ఆ నగదు భద్రపరచి, తాను చనిపోతే ఆ డబ్బుతో అంత్యక్రియలు చేయించాలని కోరింది. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి పొన్నమ్మాళ్ మృతి చెందింది. వెంటనే సావిత్రి తన వద్ద దాచి పెట్టిన రూ.10వేలతో అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమైంది. ఆ లోగా ఆ ప్రాంతానికి చెందిన మణి అనే యువకుడు బామ్మకు అంత్యక్రియలు చేసే విషయమై కార్పొరేషన్ అధికారులకు తెలిపేందుకు వెళ్ళాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కౌన్సిలర్ దైవ లింగం వివరాలు తెలుసుకుని ఆ బామ్మకు తన సొంత ఖర్చుతో అంత్యక్రియలు చేస్తానని చెప్పి, ఆ ప్రకారమే దైవలింగం సోమవారం ఉదయం ఆ బామ్మకు అంత్యక్రియలు జరిపించారు. ఆ బామ్మ సావిత్రి వద్ద దాచిన సొమ్మును ఆమె అస్థికల నిమజ్జనం, తద్దినం వంటి కార్యాలకు వాడమని కౌన్సిలర్ తెలిపారు. తన అంత్యక్రియల కోసం రూ.10వేలను సిద్ధం చేసుకున్న ఆ బామ్మ పొన్నమ్మాళ్ ముందు జాగ్రత్త గురించి, ఆమెకు అంత్యక్రియలు జరిపిన కౌన్సిలర్ దైవలింగం పెద్దమనస్సు గురించి ఊరి ప్రజలంతా గొప్పగా చెప్పుకుంటున్నారు.

నటీనటులు రెమ్యునరేషన్ తగ్గించుకోవాలి

● డిస్ట్రిబ్యూటర్ల సంఘం వినతి



డిస్ట్రిబ్యూటర్ల సమావేశం నిర్వాహకులు

సినీ నటీనటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోవాలని చిత్ర పంపిణీదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ది మదురై, రామనాథపురం యుటైటెడ్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సంఘం 2024-26 సంవత్సరానికిగాను కొత్త కార్యవర్గం ఇటీవల ఎంపికైంది. సంఘం గౌరవాధ్యక్షుడిగా జీఎన్. అన్బుచెళియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అళగర్ స్వామి, కార్యదర్శిగా సాహుల్, ఉపాధ్యక్షుడిగా కేఆర్ ప్రభాకరన్, సహాయ కార్యదర్శిగా ఆర్.థామస్, కోశాధికారిగా ఆర్ఎం.మాణిక్యం, కార్యవర్గ సభ్యులుగా కె.వెంకటేశన్, జి.గుణశేఖరన్, సి.కాళీశ్వరన్, ఏఆర్ఎస్.మణి, ఆర్ఎం. వీరప్పన్, ఎస్.శరవణరాజా, ఎల్.శేఖర్, ఎస్పీ సెల్వ, ఆర్.రమేష్, వి.జ్ఞానదేశికన్ తదితరులు ఎంపికయ్యారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రధానంగా నటీనటులు తమ రెమ్యునరేషన్ తగ్గించుకోవాలని కోరారు. అలాగే, కొత్త సినిమా విడుదలైన తర్వాత ఓటీటీలకు ఆరు వారాల తర్వాతే ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం థియేటర్లకు విధిస్తున్న 8 శాతం కాంపౌండింగ్ పన్ను పూర్తిగా రద్దు చేయాలని తీర్మానించారు.

కేన్స్ ఫెస్టివల్‌కు 'ఆల్ వి ఇమేజిన్ అజ్ లైట్'



హృదు హరూన్

పాయల్ కపాడియా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ఆల్ వి ఇమేజిన్ అజ్ లైట్'. కోలీవుడ్ యువ హీరో హృదు హరూన్ కథానాయకుడిగా నటించారు. అయితే, ఈ చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీ పడుతోంది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారతీయ చిత్రం ఈ ఫెస్టివల్‌లో పోటీ పడటం ఇదే తొలిసారి. ఫ్రాన్సెస్ ఫోర్డ్ కొప్పోలా, డేవిడ్ రోహన్ వంటి ప్రపంచ ప్రసిద్ధి సృష్టికర్తల రచనలతో ఈ చిత్రం పోటీపడటం గమనార్హం. ఇందులో హృదు హరూన్ సరసన గని శృతి, దివ్వ ప్రియలతో పాటు పలువురు కోలీవుడ్ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. గతంలో బృందా మాస్టర్ థగ్స్ చిత్రంలో హృదు హరూన్ హీరోగా నటించారు. అలాగే, విజయ్ సేతుపతి - సంతోష్ శివన్ కాంబినేషన్‌లో వచ్చిన 'ముంబైకర్'లో, అమెజాన్ తెరకెక్కించిన ఒక వెబ్ సిరీస్‌లలో ముఖ్య పాత్రలు పోషించారు. ఇపుడు పాయల్ కపాడియా దర్శకత్వంలో నటించారు. ఈ చిత్రానికి అంతర్జాతీయ వేదికలపై సినీ ప్రముఖుల ప్రశంసలు లభిస్తున్నాయి. ఇదిలావుంటే, వెట్రిమారన్ దర్శకత్వంలో, మలయాళ దర్శకుడితో ఒక చిత్రంలో హృదు హరూన్ నటిస్తున్నారు. ఈ నెల 25న ప్రకటించే కేన్స్ చిత్రోత్సవాల్లో ఈ చిత్రానికి అవార్డు వస్తుందన్న నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది.

చిత్రజ్యోతి

అధర్వ సరసన యూట్యూబ్ ఫేం!



నిహారిక

హీరో అధర్వ నటించే కొత్త చిత్రంలో యూట్యూబ్ ఫేం నిహారిక హీరోయిన్‌గా ఎంపికైంది. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సాధారణంగా గతంలో సినిమాల్లో అవకాశాల కోసం ప్రత్యేక ఫొటో షూట్ చేసి.. ప్రతి నిర్మాణ కంపెనీ ఆఫీసుల చుట్టూత చెప్పులు అరిగిపోయేలా తిరిగేవారు. కానీ, ఇపుడు కాలం మారిపోయింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఎంతో మంది యువతీ యువకులు తమలోని ప్రతిభను సోషల్ మీడియా వేదికగా చూపిస్తున్నారు. వీటిని చూసిన దర్శకనిర్మాతలు తమ సినిమాల్లో అవకాశాలు ఇస్తున్నారు. ఇలాంటి అవకాశమే యూట్యూబర్ నిహారికకు వరించింది. హాస్యభరితంగా రీల్స్ చేసి, వాటిని సోషల్ మీడియాలో షేర్ చేసి మంచి గుర్తింపు పొందిన నిహారిక... ఇపుడు అధర్వ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. కొత్త దర్శకుడు ఆకాష్ భాస్కరన్ రూపొందించే ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్ నిర్మించనుంది. ఇందులో నిహారిక న్యూయార్క్ యువతిగా నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా సింహభాగం న్యూయార్క్‌లోనే జరుపుకోనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

సినిమాలు తగ్గించాను..

భక్తి మార్గంలో వెళ్తున్నా : నటి నళిని



'గీతం వెజ్' రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న నళిని తదితరులు

ఉద్దేశ్యపూర్వకంగా సినిమాల్లో నటించడం తగ్గించి, భక్తి మార్గంలో వెళుతున్నట్టు సినీ నటి నళిని చెప్పారు. అన్నాశాలైలో నెలకొల్పిన 'గీతం వెజ్ రెస్టారెంట్'ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ప్రతి పురుషుడు వెనుక మహిళ ప్రోత్సాహం ఉంటుంది. ప్రతి మహిళ విజయంలోనూ భర్త సహకారం ఉంటుంది. అయినప్పటికీ మహిళలు భర్తల వెనుకే ఉంటారు. రోజువారీ దినచర్యలతో పాటు కుటుంబ పనులతో సతమతమయ్యే మహిళలకు వారాంతంలో ఒక్క రోజైన వంటగది వైపు వెళ్ళకుండా భర్తలు దృష్టిసారించాలి. ఈ రెస్టారెంట్‌లో మంచి శాఖాహార భోజనం కోసం ఆశపడేవారికి ఇష్టమైన, రుచికరమైన ఆహారం ఉదయం 6 గంటల నుంచి అర్థరాత్రి 2 గంటల వరకు లభిస్తుంది. ఈ అవకాశాన్ని శాఖాహార ప్రియులు సద్వినియోగం చేసుకోవాలి. సినిమాల్లో నటించడం ఉద్దేశపూర్వకంగా తగ్గించాను. సీరియళ్ళలో నటించడం ఎంతో అనువుగా ఉంది. ఉదయం వెళ్ళి సాయంత్రానికి ఇంటికి వచ్చేస్తున్నాను. అలాగే, ఆధ్యాత్మికపరంగా భక్తిమార్గంలో సాగిపోతున్నాను' అని పేర్కొన్నారు. తమ వెజ్ రెస్టారెంట్ దక్షిణ భారతీయ వంటకాలకు ప్రసిద్ధి చెందిందని, స్వదేశీ వంటకాలు మాత్రమే కాకుండా ఇండో-చైనీస్, చాట్, నార్త్ ఇండియన్స్ వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయని, గీతం రెస్టారెంట్ ద్వారా భారతీయ ఆహారపు రుచిని ప్రపంచానికి అందిస్తున్నట్టు గీతం వెజ్ రెస్టారెంట్ యజమాని మురళి ఎన్.భట్ తెలిపారు. దేశ వ్యాప్తంగా తమ ఔట్‌లెట్‌లు ప్రారంభించే ప్రణాళికలున్నాయని ఆయన తెలిపారు.

ఫీనిక్స్‌మాల్‌లో 'స్పెల్‌బీ ఫినాలే'



క్యాట్‌వాక్‌లో మోడల్స్

అడయార్, మే 20: చెన్నై నగరంలోని ప్రీమియం మాల్స్‌లో ఒకటైన ఫీనిక్స్ మాల్‌లో వారాంతంలో రెండు రోజుల పాటు స్పెల్ బీ ఫినాలేతో పాటు జూనియర్ ఫ్యాషన్ ఫార్వర్డ్ ఫ్యాషన్ షోలను విజయవంతంగా నిర్వహించారు. శనివారం హాలిడే ల్యాండ్‌లో ఎంతో ఆసక్తికరంగా సాగింది. స్పెల్‌బీ ఫినాలేలో యువ స్పెల్లింగ్ ఔత్సాహికులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే, హాలిడే ల్యాండ్ ప్రత్యేకంగా నిర్వహించిన జూనియర్ ఫ్యాషన్ ఫార్వర్డ్ ఫ్యాషన్ షోను ఆదివారం విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లైఫ్ స్టైల్, షాపర్స్ స్టాప్, పాంటాలూన్స్, మ్యాక్స్, ట్రెండ్ సహా దాదాపు 20కి పైగా బ్రాండ్ కంపెనీలు తమ ట్రెండీ కలెక్షన్లను ప్రదర్శనకు ఉంచాయి. ఇవి ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి.

బర్మింగ్‌హామ్ అకాడమీతో చెన్నై 'అమృత' కీలక ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

అడయార్, మే 20: బర్మింగ్‌హామ్ అకాడమీ సింగపూర్‌తో చెన్నై అమృత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఓ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హాస్పిటాలిటీ విద్య బోధించడంలో ఒక మైలురాయిగా నిలిచిన చెన్నై అమృత విద్యా సంస్థ విద్యార్థులకు అసమానమైన అంతర్జాతీయ అభ్యాస అనుభవాన్ని అందించేందుకు వినూత్న భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి తద్వారా ఒక ప్రత్యేకమైన విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు హాస్పిటాలిటీ పరిశ్రమలో సమగ్రమైన అవగాహన, నైపుణ్యాన్ని అందించడానికి ఎంతగానో దోహదపడుతుందని చెన్నై అమృత హోటల్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు వెల్లడించారు.

ముట్టుకాడులో ఫ్లోటింగ్ రెస్టారెంట్



ప్యారీస్, మే 20: రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఫ్లోటింగ్ రెస్టారెంట్ జూన్‌లో అందుబాటులోకి రానున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రకటించింది. చెన్నై ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో పర్యాటక శాఖ నిర్వహణలోని ముట్టుకాడు బోట్ హౌస్ ప్రాంగణంలో పర్యాటకులను ఆకర్షించేలా నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ రెస్టారెంట్ రూ.5 కోట్లతో నిర్మిస్తున్నారు. తొలిసారిగా నీటిపై తేలియాడే నౌక రెస్టారెంట్ 125 అడుగుల పొడవు, 25 అడుగుల వెడల్పుతో రెండంతస్తులతో రూపుదిద్దుకుంటోంది. కింది అంతస్తు పూర్తిగా ఎయిర్ కండిషన్‌తో ఉంటుంది. పై అంతస్తులో పర్యాటకులు కూర్చుని తింటూ ప్రకృతిని ఆస్వాదించవచ్చు. 60 హార్స్ పవర్ సామర్థ్యం కలిగిన యంత్రాల ద్వారా ఈ ఫ్లోటింగ్ రెస్టారెంట్ పడవ నడుపుతారు. దాదాపు 80 శాతానికి పైగా నిర్మాణపనులు పూర్తికావడంతో జూన్‌లో ప్రారంభించనున్నట్లు పర్యాటక అభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.





కార్యక్రమంలో పాల్గొన్న యువకులు, స్థానిక ప్రజలు - ప్రసంగిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసన్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెరంబూర్, మే 20: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ ఉత్తర్వులతో నగరంలో మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ తరలింపును అడ్డుకొనేలా 'డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్' పేరుతో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. అలాగే, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, బీచ్‌లు, పార్కులు, బస్టాండ్ సహా రద్దీ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, అన్నానగర్ పోలీసు జిల్లా పరిధిలోని జేజే నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కమిషనర్ వీఆర్ శ్రీనివాసన్ పాల్గొని... మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల మత్తులో జరుగుతున్న నేరాలు, ౨, అలాంటి సంఘటనల్లో విధించే జైలుశిక్షలు తదితరాలను వివరించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సీయూబీ నికర లాభం రూ.255 కోట్లు



డాక్టర్ ఎన్.కామకోటి

● ఎండీ కామకోటి

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): సిటీ యూనియన్ బ్యాంక్ నికర లాభం రూ.255 కోట్లకు పెరిగిందని, ఇది గత యేడాది కంటే 17 శాతం అధికమని ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కామకోటి తెలిపారు. మార్చి 31న ముగిసిన నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను సోమవారం ఆయన వెల్లడించారు. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం గత యేడాది రూ.514 కోట్లు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.547 కోట్లకు పెరిగిందని తెలిపారు. బ్యాంక్ మంజూరు చేసిన డిపాజిట్లు కూడా ఆరు శాతం పెరిగాయని, గత ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంక్‌లో రూ.52,398 కోట్ల మేరకు డిపాజిట్లుండేవని, ప్రస్తుతం రూ.55,657 కోట్లకు పెరిగాయన్నారు. బ్యాంక్ రుణాలు కూడా ఎక్కువగా ఇచ్చామని, గత సంవత్సరం రూ.43,971 కోట్ల మేర రుణాలు మంజూరు చేయగా ప్రస్తుతం రూ.46,418 కోట్లకు పైగా రుణాలిచ్చామని ఆయన వివరించారు.

హైపర్ టెన్షన్‌పై ఉచిత స్క్రీనింగ్



కార్యక్రమంలో నిపుణులు

అడయార్, మే 20: ది వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ (డబ్ల్యూహెచ్‌ఎల్) ఆధ్వర్యంలో నగర వాసుల కోసం హైపర్‌టెన్షన్‌పై ఉచిత స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో దాదాపు 300 మందికి పైగా పాల్గొని ఉచిత స్క్రీనింగ్ వైద్య పరీక్షలను చేయించుకున్నారు. నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యులు ఈ క్యాంపులో పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. చెట్‌పేట్‌లోని లేడీ ఆండాల్ మెట్రిక్యులేషన్ స్కూల్‌లో జరిగిన ఈ క్యాంపులో పాల్గొన్న వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఎన్.నరసింగన్ మాట్లాడుతూ, నగరవాసుల్లో హైపర్‌టెన్షన్‌పై అవగాహన కల్పించే నిమిత్తం ఈ తరహా కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఊహించినదానికంటే అధిక స్పందన రావడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

యువర్ షాప్ క్లబ్ ప్రారంభం

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో యువర్ షాప్ క్లబ్ పేరుతో కొత్త ఆన్‌లైన్ షాపింగ్ కేంద్రం ఏర్పాటైంది. ఈ షాప్‌క్లబ్‌ను ఆన్‌లైన్ షాపింగ్ వాణిజ్యంలో అనుభవం గడించిన ఎం.రమేష్, కే శ్రీనివాసన్, సీటీఓ శ్రీరామ్ సెల్వకుమార్ నెలకొల్పారు. నగరంలోని ఓ స్టార్‌హోటల్‌లో ఈ షాప్ క్లబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గృహోపకరణాలు ఎలక్ట్రానిక్స్ వస్తువులు, దుస్తులు తదితర వస్తువులు తమ క్లబ్ ద్వారా తక్కువ ధరలకు, పలు రాయితీలపై అభిప్రాయన్నారు. తమ సంస్థ ద్వారా నాణ్యమైన స్వదేశీ వస్తువులే సరఫరా అవుతాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ అయిన వస్తువులను సరఫరా చేయడానికి ఎస్ఏఆర్ లాజిస్టిక్స్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకున్నట్లు పేర్కొన్నారు.



యువర్‌షాప్ క్లబ్ ప్రారంభోత్సవంలో సంస్థ నిర్వాహకులు



కాంచీపురం వరదరాజస్వామివారి ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాల సందర్భంగా ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు, వైష్ణవ పండితులు

ఏఏసీసీఐ తమిళనాడు శాఖ ప్రారంభం



ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): 'ది ఆసియన్ ఆఫ్రియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' (ఏఏసీసీఐ) తమిళనాడు శాఖ ప్రారంభించింది. నగరంలని ఓ హోటల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, నిపుణులు ఈ శాఖను ప్రారంభించారు. తమిళనాడు శాఖకు నూతన అధ్యక్షునిగా ఎన్నికైన జానీ జెర్మన్స్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఏఏసీసీఐ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జీడీ సింగ్ మాట్లాడుతూ... ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని పెంపొందించడంలో తమిళనాడు కీలక పాత్రను కొనియాడారు. ఆసియా, ఆఫ్రికా మధ్య వాణిజ్యాన్ని పెంపొందించడానికి తమిళనాడు కీలకమైన గేట్‌వేగా పని చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



గిండి గాంధీమండపంలో తమిళ సంఘసంస్కర్త, ద్రావిడ జ్యోతి పండిత అయోధ్య దాసర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ సంచాలకులు ఎల్.సుబ్రమణియన్, పౌరసంబంధాల శాఖ సంచాలకుడు డాక్టర్ ఇరి వైద్యనాథన్ తదితరులు

ఆస్ట్రేలియాలో శ్రీఓం కేర్‌కు శంకుస్థాపన



శ్రీఓం కేర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జ్ఞానసత్యేంద్ర స్వామి తదితరులు

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవలందించటంలో పేరొందిన శ్రీఓం కేర్ సంస్థ తన సేవల విస్తరణలో భాగంగా ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో తన కొత్త సంస్థ ఏర్పాటు చేయనుంది. ఆ మేరకు సోమవారం ఉదయం శ్రీఓం కేర్ సంస్థకు ఓం పంచశక్తి పీఠం పీఠాధిపతి శ్రీఓం జ్ఞాన సత్యేంద్రస్వామి సమక్షంలో శంకుస్థాపన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఎంపీలు డాక్టర్ ఆండ్రూ చారిటాన్, డొన్నా డేవిస్, మేయర్ ఫైరీ ఎస్సెర్, కౌన్సిలర్లు రీనా జేటీ, సమీర్ పాండే, భారత రాయబారి గోపాల్ బాగ్లే కాన్సుల్ జనరల్ జానకిరామన్ తదితరులు పాల్గొన్నారు.

మదురై కలైంజర్ గ్రంథాలయంలో ప్రవేశించిన నీరు

పెరంబూర్, మే 20: మదురైలో ఉన్న కలైంజర్ సెంటినరీ గ్రంథాలయంలోని కింది అంతస్తులో ఉన్న సందర్శకుల గది, ఆడిటోరియం ప్రాంతాల్లో నీరు చేరడంతో, రెండు పుస్తకాల గదులు, పాఠకుల గదిని తాత్కాలికంగా మూసివేశారు. మదురైలో రూ.215 కోట్లతో నిర్మించిన ఈ గ్రంథాలయాన్ని 2023 జూలై 15వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అధునాతన వసతులు, గ్రంథాలు, పుస్తకాలున్న ఈ గ్రంథాలయానికి మదురై సహా చుట్టుపక్కల జిల్లాల ప్రజలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, మదురైలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండగా, పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో, గ్రంథాలయ కింది అంతస్తులో వరద నీరు ప్రవేశించింది. దీంతో, ఆ విభాగాన్ని తాత్కాలికంగా మూసివేసిన సిబ్బంది నీటిని తొలగిస్తున్నారు. మంగళవారం ఈ గ్రంథాలయాన్ని యథావిధిగా సందర్శించవచ్చని అధికారులు తెలిపారు.